క్లుప్తంగా

బదిలీ అయిన పోలీసులకు సన్మానం



చాట్రాయి: చాట్రాయి పోలీస్ స్టేషన్‌లో బదిలీ అయిన సిబ్బందికి సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏఎస్ఐ గజపతిరావు, హెడ్ కానిస్టేబుల్ ఎం. శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు విష్ణు, కె. గిరిబాబు, అశోక్, వెంకటేశ్వరరావు నాయక్, కనకదుర్గలను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



విజయవాడరూరల్: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పార్టీ కార్యకర్తలు, ప్రజలు జయప్రదం చేయాలని ఆ పార్టీ విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు బయ్యారపు కిశోర్ పిలుపు నిచ్చారు. మంగళవారం పైడూరుపాడు గ్రామంలో మండల పార్టీ కార్యాలయంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. గొల్లపూడి ఎంపీటీసీ సభ్యుడు షేక్ సైదాబీవలి, జిల్లా కార్యదర్శి పరికల శ్రీనివాసరావు, పోతురాజు మాధవ, జక్కంపూడి గ్రామ అధ్యక్షుడు గంధం శ్రీనివాసరావు వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం పరిశీలన



నూజివీడు: మహిళలు ఆర్థికంగా బలోపేతం అయినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని, దీనిలో భాగంగానే కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ అన్నారు. మండలంలోని తుక్కులూరులో మహిళలకు నిర్వహిస్తున్న కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మహిళలు కుట్టు శిక్షణకు ప్రతి రోజూ వచ్చి చక్కగా నేర్చుకోవాలన్నారు. శిక్షణ అనంతరం కుట్టు మిషన్ కొనుక్కునేందుకు బ్యాంకుల నుంచి రుణాలను ఇప్పిస్తామన్నారు. ఇక్కడ 120 మంది మహిళలు రెండు విడతలుగా శిక్షణ పొందుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ చంద్రిక, జూనియర్ అసిస్టెంట్ సుష్మ, కో–ఆర్డినేటర్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ రవిచంద్ర సేవలు అమూల్యం



తిరువూరు: ఆర్టీసీ డ్రైవరు రవిచంద్ర నిబద్ధతతో పనిచేశారని, ప్రమాదరహిత వాహన చోదకుడిగా పలుమార్లు పురస్కారాలు అందుకున్నారని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వలిశెట్టి దామోదరరావు అన్నారు. తిరువూరు ఆర్టీసీ డిపోలో 35 సంవత్సరాలు డ్రైవరుగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన బొమ్మదేవర రవిచంద్ర వీడ్కోలు కార్యక్రమంలో మంగళవారం జరిగింది. పలువురు ఉద్యోగులు రవిచంద్రను ఘనంగా సన్మానించారు. ఎంప్లాయిస్ యూనియన్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ ప్రసాద్, తిరువూరు డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ధర్నా



తిరువూరు: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తిరువూరు పట్టణంలోని పేదలకు రెండు సెంట్ల చొప్పున నివేశన స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏడాది గడచినా ఎన్నికల హామీ నెరవేరకపోవడంతో పేద వర్గాలు ఇళ్లు నిర్మించుకునేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, వెంటనే పట్టాలు పంపిణీ చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్ కోరారు. ఈ మేరకు ఇన్‌చార్జి తహసీల్దారు నాగమణికి వినతి పత్రం సమర్పించారు. నాయకులు తూము కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు, నాగుల్‌మీరా, సుబానీ, వనమాలి తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి హామీలు అక్కడే!

- ఏడాది గడుస్తున్నా అములు కాని హామీలు
- అభివృద్ధికి నోచుకోని పార్కులు
- అసంపూర్తిగా ఇండోర్ స్టేడియం నిర్మాణం



నూజివీడులో అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియం



అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లు

నూజివీడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోంది. ఈ ఏడాది కాలంలో కల్లబొల్లి కబుర్లు చెప్పడం మినహా చేసిందేమీ లేదని ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అలాగే ఎన్నికల సమయంలో కూటమి నూజివీడు అభ్యర్థి పార్థసారథి నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నో హామీలు ఇచ్చారు. అయితే అధికారం చేపట్టి ఏడాదైనా ఇప్పటికీ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారా అని నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపడం, నూజివీడు–విజయవాడ రహదారిని నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేయడం, పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సదుపాయాన్ని కల్పించడం, పట్టణ రహదారులను విస్తరించి అభివృద్ధి చేయడం వంటివి ఉన్నాయి. వీటిల్లో ఏ ఒక్కటీ నెరవేరిన దాఖలాలు లేవు. మంత్రి కొలుసు పార్థసారథి ఇచ్చిన హామీల ఇవీ..

పార్కుల అభివృద్ధి ఊసే లేదు

పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు పార్కులను అభివృద్ధి చేస్తామని చెప్పారు. అయితే ఇంతవరకు పార్కుల అభివృద్ధి ఊసే లేదు. పార్కుల అభివృద్ధికి ఏం చేస్తారనే ప్రణాళిక కూడా ఇంతవరకు లేదు. దీంతో పార్కులు అందుబాటులోకి రావడం అనేది తీరని కలగానే మిగిలిపోనుంది.

నూజివీడులో ఇండోర్ స్టేడియం అభివృద్ధి ఎప్పుడు?

పట్టణంలో 2014లో అప్పటి ఎమ్మెల్సీ పాలడుగు వెంకట్రావు ఇండోర్ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, దాని నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. ఈ పరిస్థితుల్లో తాను గెలవగానే ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని ఎన్నికల సమయంలో పార్థసారథి హామీ ఇచ్చారు. ఏడాది గడిచినా ఇండోర్ స్టేడియం నిర్మాణం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

అసంపూర్తిగా టిడ్కో గృహాల నిర్మాణం

పట్టణంలోని టిడ్కో గృహాలను ఆరు నెలల్లో లబ్ధిదారులకు అందజేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి ఏడాది పూర్తవుతున్నా ఇంతవరకు అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. పట్టణంలో దాదాపు 2,600 మందికి టిడ్కో గృహాలను అందజేయాల్సి ఉంది. లబ్ధిదారులు ఎప్పుడు ఇస్తారా అని ఎదురు చూస్తున్నారు. అలాగే నూజివీడు పట్టణానికి చుట్టూ రింగ్ రోడ్డును ఏర్పాటు చేయడం, ఆగిరిపల్లి మండలం తోటపల్లి వద్ద ఉన్న బ్రహ్మలింగం చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం, చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి నూజివీడు ప్రాంతానికి రబీలో సాగునీరు అందించడం. నూజివీడు పట్టణంలోని గాంధీ నగర్‌లో ఉన్న స్టేడియం స్థలంలో ప్రజల ప్రయోజనార్థం వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్కు, షటిల్, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేయడం, చాట్రాయి మండలం పిట్టల వారి గూడెం వద్ద రైతుల ప్రయోజనార్థం సాగునీరు నిమిత్తం ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయడం వంటి హామీలు ఇచ్చారు. ఇవేమీ ఇంత వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఈ హామీలను ఎప్పుడు అమలు చేస్తారోనని నియోజకవర్గ ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

నేడు 'వెన్నుపోటు దినం' విజయవంతం చేయండి

నూజివీడు: వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు బుధవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నూజివీడులో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మంగళవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు ద్వారకా సెంటర్ నుంచి చిన్న గాంధీబొమ్మ సెంటర్, పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్, పెద్ద గాంధీబొమ్మ సెంటర్, శ్రీనివాసా సెంటర్ల మీదుగా కార్యకర్తలు, నాయకులు ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

- తిరువూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైనందున వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు బుధవారం తిరువూరులో వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు తెలిపారు. తిరువూరు శాంతినగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని కార్యాలయంలో మెమోరాండం సమర్పిస్తామని చెప్పారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని కోరారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలపై అవగాహన



మైలవరంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి



నూజివీడులో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు

మైలవరం: భూగర్భ కాలుష్యానికి మూలకారణం ప్లాస్టిక్ వినియోగమని వెల్లడం జెడ్పీహెచ్ స్కూల్ ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి అన్నారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం విద్యార్థులతో ముందుగా పుస్తక పఠనం చేయించారు. అనంతరం నీతి కథలు చెప్పించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం మానవుని ఆరోగ్యానికి హానికరమని వివరించారు. విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

నూజివీడు: పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 8 నుంచి విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. దేశాభివృద్ధిలో యువత పాత్రపై గ్రంథాలయాధికారి బీహెచ్ శ్రీనివాసరావు పలు అంశాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలు, సినిమాలకు దూరంగా ఉండాలని, పుస్తకాలను చదవడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. పుస్తకాలను చదవడం వలన విజ్ఞానం పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్స్‌పై మోజు వద్దు

తిరువూరు: విద్యార్థులు మొబైల్ ఫోన్లకు సాధ్యమైనంత దూరంగా ఉండాలని తిరువూరు శాఖా గ్రంథాలయాధికారి కె. పద్మావతి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళవారం పుస్తక పఠనం ఆవశ్యకతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మారుతున్న సాంకేతిక పరిస్థితుల కనుగుణంగా చిన్న పిల్లలకు సైతం పాఠశాలల్లో మొబైల్స్, ట్యాబ్స్‌తో పాఠాలు బోధిస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలు వీటిని అవసరం మేరకే వినియోగించే విధంగా చూడాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి.

పెనుగొలనులో..

గంపలగూడెం మండలం పెనుగొలను శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. చదరంగం, క్యారమ్స్ ఆటల్లో శిక్షణ ఇచ్చారు. చేతిరాతలో నైపుణ్యం, కథలు చెప్పడం తదితర అంశాల్లో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ నెల 6న శిక్షణా తరగతులు ముగుస్తాయని గ్రంథాలయాధికారి శ్రీలత తెలిపారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు సహించం

ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాఘవేంద్రనాథ్

నూజివీడు: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ హెచ్చరించారు. మండలంలోని దిగవల్లి, తూర్పు దిగవల్లి, ముక్కొల్లుపాడులో ఉపాధి హామీ పథకంలో చేస్తోన్న చెరువు పూడిక తీత పనులను ఎంపీడీఓ మంగళవారం పరిశీలించి మాట్లాడారు. కూలీలు రోజుకు ఒక క్యూబిక్ మీటర్ పనిని చేస్తే గరిష్ఠంగా రూ.307 కూలిని పొందొచ్చన్నారు. కూలీల మస్తరులో ఎలాంటి అక్రమాలకూ తావు లేకుండా నమోదు చేయాలని చెప్పారు. పనులకు వచ్చిన కూలీలకు మాత్రమే హాజరు వేయాలన్నారు. సామాజిక పనుల కంటే రైతులకు సంబంధించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. కూలీలకు కొలతల ప్రకారమే కూలి డబ్బులు చెల్లిస్తామన్నారు. ఒకరికి బదులు మరొకరికి మస్తరు వేయొద్దన్నారు. ఈసీ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై కళాజాతా ప్రదర్శన



కళాజాతా బృందం కళాకారులు చేస్తున్న ప్రదర్శన

నూజివీడు: పర్యావరణ పరిరక్షణపై ఏపీ కాలుష్య మండలి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో కళాకారులు కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. ఎం.ప్రశాంత్ కుమార్ అండ్ పార్టీ కళాకారుల ప్రదర్శన వీక్షకులను ఆకట్టుకుంది. ఎండింగ్ ప్లాస్టిక్ అనే నినాదంతో ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ కవర్లు నేలలో వందల ఏళ్ల తరబడి కలవకుండా అలాగే ఉంటాయని వారు వివరించారు. మన జీవన విధానాన్ని మెరుగుపరచుకునేందుకు అవలంబించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి పెంచడం, కాలుష్య కారకాల విడుదలను తగ్గించడం వంటి వాటి గురించి తెలిపారు. కళాజాతా బృందం సభ్యులు ఎం.ప్రశాంత్ కుమార్, ఎం.తిరుపతి కుమార్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక, శారీరక దృఢత్వం



తిరువూరు ఆర్టీసీ బస్టాండులో యోగాలో శిక్షణ పొందుతున్న కార్మికులు

ఆగిరిపల్లి: యోగాతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్ఐ శుభశేఖర్ అన్నారు. యోగాంధ్రలో భాగంగా మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. ఆయన మాట్లాడుతూ యోగా అనేది ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో ఒక భాగం కావాలన్నారు. యోగా ప్రతి రోజూ సాధన చేయాలన్నారు. యోగాతో శారీరక రుగ్మతలు దూరమవుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ యోగాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు యోగా శిక్షణ

తిరువూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో కార్మికులకు మంగళవారం యోగాలో శిక్షణ ఇచ్చారు. ప్రతిభ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, యోగా శిక్షకుడు శ్రీనివాసాచారి యోగాసనాల ఉపయోగాలను వివరించారు. ప్రతి రోజూ యోగాసనాలు వేయడం వలన మానసిక ప్రశాంతత, ఏకాగ్రత లభిస్తుందని పేర్కొన్నారు. ఆర్టీసీ డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం, కార్మికులు యోగాసనాలు సాధన చేశారు.

- ఇబ్రహీంపట్నం: నిత్య యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎన్టీటీపీఎస్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణమాచారి అన్నారు. స్థానిక ఎ.కాలనీ ఇంజినీర్స్ అసోసియేషన్ హాల్ వద్ద నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో మంగళవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయుష్ మెడికల్ అధికారి ఎండీ జునిద్, మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన, యోగా టీచర్లు శ్రీనివాస్, లక్ష్మీ, జెన్‌కో ఉద్యోగులు, ఎస్పీఎఫ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: పుల్లూరు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ గార్లపాటి రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బాడవ, పుల్లూరు, సీతారామపురం తండా గ్రామాలకు, రైతులకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

- మైలవరం: మైలవరం మండలం చంద్రాల సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని గణపవరం ఏఈ సీహెచ్ రామమోహనరావు తెలిపారు. గ్రామస్తులు సహకరించాలని కోరారు.
- నూజివీడు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంప్లాయిస్ కాలనీ, కోనేరుపేట, చిన్న గాంధీ బొమ్మ సెంటర్, పాతపేట, కొప్పుల వెలమ పేట, జంక్షన్ రోడ్డు, డీఏఆర్ కాలేజీ రోడ్డు, రైతు బజారు ఏరియాల్లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

పశువుల దాణా పంపిణీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో కొండపల్లి పశు వైద్యశాల వద్ద 50 శాతం సబ్సిడీపై పశువుల దాణాను మంగళవారం పంపిణీ చేశారు. పశు వైద్యాధికారి స్వాతిఅయ్యప్ప మాట్లాడుతూ పశువులు, జీవాలకు వ్యాధులు రాకుండా టీకాలు వేస్తున్నామన్నారు. నట్టల నివారణకు అవసరమైన మందులు వైద్యశాలలో ఉన్నాయని చెప్పారు. 50 శాతం సబ్సిడీపై పశువుల దాణాను అందజేస్తున్నామని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదివాసీలపై దాడులను ఆపాలి

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నేత హరినాథ్

నూజివీడు: ఆపరేషన్ కగార్ పేరుతో పోలీసులు ఆదివాసీలపై చేస్తున్న దాడులను ఆపాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర క్యార్యవర్గ సభ్యుడు డి.హరినాథ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విప్లవకారుడు నంబాల కేశవరావు మృతదేహాన్ని కూడా కుటుంబ సభ్యులకు అప్పగించకుండా హైకోర్టు తీర్పును అవహేళన చేశారని ధ్వజమెత్తారు. సైన్యం, రాజ్య హింస తోడై శవ దహనాలకు పూనుకున్న ఘటన ప్రజాస్వామ్యానికి మాయని మచ్చన్నారు. విప్లవకారులను భౌతికంగా నిర్మూలించగలరేమో కానీ వారి ఆశయాలకు తూట్లు పొడవలేరని, కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను కట్టబెట్టేందుకు ఆదివాసీల ప్రాణాలను మూల్యంగా ఎన్‌కౌంటర్ల పర్వాన్ని కొనసాగిస్తున్నారని హరినాథ్ విమర్శించారు. నియంతలా వ్యవహరించిన హిట్లర్, ముస్సోలినీల గుణపాఠాల చరిత్ర పునరావృతం కానుందని, ప్రజా ఉద్యమాలే అంతిమ పరిష్కారమని హరినాథ్ స్పష్టం చేశారు.

అల్లుకుపోయిన నిర్లక్ష్యం



చాట్రాయి: పచ్చటి తీగలతో విద్యుత్ స్తంభాలు దర్శన మిస్తున్నాయి. మండలంలోని తుమ్మగూడెం కో–ఆపరేటివ్ బ్యాంకు వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పచ్చటి తీగలు అల్లుకుపోవడంతో విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోంది. చనుబండ గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌కు తీగలు అల్లుకుంటూ పైకి పోతుండడంతో సిగ్నల్స్‌కి అంతరాయం ఏర్పడొచ్చని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

వంట ఏజెన్సీ నిర్వాహకులకు శిక్షణ

విస్సన్నపేట: సమగ్ర శిక్ష, విద్యా శాఖ ఉత్తర్వుల మేరకు మండలంలోని వంట ఏజెన్సీ నిర్వాహకులకు స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించే విషయంలో వంట ఏజెన్సీ నిర్వాహకులకు విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు జరిగాయి. విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారం రుచిగా వండి వడ్డించడాన్ని వివరించారు. టాటా ట్రస్ట్ జిల్లా పీఏ వి. భూలక్ష్మి రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఎంఈఓ 2 సుధాకర్, హెచ్ఎం శోభారాణి పాల్గొన్నారు.

వీధి కుక్కలు, కోతులను నిర్మూలించాలని వినతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీలో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలు, కోతులను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు కొండపల్లి మున్సిపల్ కార్యాలయ అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ కొండపల్లి మార్కెట్ సెంటర్‌లో రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేశాయన్నారు. దాడిలో చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. మరోపక్క కోతుల బెడద తీవ్రంగా ఉందన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు రోడ్లపైకి రావాలంటేనే భయపడుతున్నారని చెప్పారు. తక్షణం కోతులు, వీధికుక్కలను నిర్మూలించాలని కోరారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు.